సీఎం రేవంత్‌రెడ్డి ని కలిసిన మున్నూరుకాపు నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల మున్నూరుకాపు సంఘం నాయకులు

మేడ్చల్: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డిని మండల, పట్టణ మున్నూరు కాపు సంఘం నాయకులు కలిసి సన్మానించారు. నగరంలోని సీఎం నివాసానికి నాయకులు వెళ్లి కలిశారు. ఎన్నో ఏళ్లుగా కార్పొరేషన్ కోసం పోరాటం చేసినా ఎవరూ పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన కులాన్ని పట్టించుకోవడం అభినందనీయమని అన్నారు. సీఎంను కలిసిన వారిలో మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఆకుల సురేష్ పటేల్, ఇతర నాయకులు ఉన్నారు.

చీర్యాల స్వామిసేవలో నవీన్‌మిట్టల్



కీసర: శ్రీచీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో బుధవారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన నవీన్ మిట్టల్ దంపతులకు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు నవీన్ మిట్టల్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

జవహర్‌నగర్ బడ్జెట్ రూ.17.84 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన 2024–2025 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.17.84 కోట్లకు పాలకమండలి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కార్పొరేటర్లు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు పూర్తి బాధ్యత పాలకమండలి సభ్యులతోపాటు అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు, డీఈఈ మాదవచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్ స్రవంతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కమ్యూనిటీ భవనం ప్రారంభం

పోచారం: యంనంపేట్‌లో రూ.35 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ కొండల్ రెడ్డి తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు అనే అంశంపై దుకాణాదారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

'పీఎం సూరజ్ పోర్టల్'లో కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: సామాజిక అభ్యున్నతి అండ్ ఆధారిత ప్రజా సంక్షేమం పీఎం సూరజ్ పోర్టల్‌ను బుధవారం ఆన్‌లైన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కార్యక్రమంలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. పీఎం సూరజ్ పోర్టల్ ద్వారా ప్రధానమంత్రి రూ. లక్ష ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రుణ వితరణ కింద అందజేయటం జరిగింది. సఫాయి కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు మంజూరు చేశారు. ఈ కార్డుల ద్వారా రూ.ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా అందరి కార్మికులకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరాంజనేయ స్వామి దేవాలయం నూతన ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ పాల్గొని ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ చైర్మన్‌గా పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌గా నారోజు జంగాచారి, లోడె పవన్‌కుమార్ గౌడ్, బార్ల నాగరాజు, ఎర్ర ఐలేష్‌యాదవ్, కొల్తూరి కుమార్, ముదిగొండ మహేశ్వరి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పారదర్శకంగా పని చేసి, ప్రతి రూపాయి జమ, ఖర్చులను ప్రతినెలా కమిటీ సభ్యులకు, భక్తులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఆలయ పరిరక్షణ కోసం అంకితం అవుతామని వారు ప్రమాణం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఆలయ బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో నాయకులు పాశం బుచ్చి యాదవ్, తుంగతుర్తి రవి, వంగేటి ప్రభాకర్ భక్తులు పాల్గొన్నారు.

'జీ' ఆధ్వర్యంలో మైండ్‌వార్స్ షురూ..

సాక్షి, సిటీబ్యూరో: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం మైండ్ వార్స్ పేరిట వివిధ రకాల క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఉమేష్ కెఆర్ బన్సాల్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్, సైబర్ టెక్నాలజీలలో మైండ్ వార్స్ ఒలింపియాడ్, భాషా నైపుణ్యాలకు సంబంధించి మైండ్ వార్స్ స్పెల్ బీ ఇండియా, జియోగ్రఫీ, క్రీడలు, చరిత్ర తదితర అంశాలకు సంబంధించి మైండ్ వార్స్ నాలెడ్జ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

అక్రమ ఇళ్లు, లేఔట్ల కూల్చివేత

- చీర్యాలపెద్ద చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కుడా ఇళ్ల నిర్మాణాలు
- ఫోర్జరీ సంతకాలతో అనుమతులు తీసుకొని అక్రమంగా నిర్మాణం
- కీసర ఓఆర్ఆర్ సమీపంలో వెలసిన అక్రమ లేఔటు



చీర్యాలలో అక్రమ ఇళ్లను ,అక్రమలేఔట్‌ను, జేసీబీ సహాయంతో కూల్చివేస్తున్న దృశ్యాలు





కీసర: చీర్యాల గ్రామపంచాయతీపరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. చీర్యాల గ్రామంలో మాజీ సర్పంచులు, గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శుల ఫోర్జరీ సంతకాలతో అనుమతులు తీసుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని చీర్యాలపెద్ద చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోకుడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు జిల్లా పంచాయతీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుఝాము 6 గంటల నుంచే రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంయుక్తంగా జేసీబీల సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ గ్రామ, మండల పంచాయతీ అధికారి వినూత్నరెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. పెద్ద చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన 11 ఇళ్లతోపాటు మరో 40 ఇళ్లను, కీసర ఓఆర్ఆర్ సమీపంలో సర్వే నెంబర్ 100, 101లో వెలసిన అక్రమ లేఔటు చుట్టూ ప్రహరి, ప్లాట్ల హద్దురాళ్లు తొలగించారు. అక్రమ నిర్మాణాలు, అక్రమంగా ఫోర్జరీ సంతకాలు, స్టాంపులుతో మోసం చేస్తున్న వ్యక్తులపై విచారణ చేపట్టి సదరు వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు.

శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ నేతలు



శంభీపూర్ రాజుతో మండల బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేరు దాదాపుగా ఖరారు కావడంతో ఆయనను మండల బీఆర్ఎస్ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంభీపూర్‌ను పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపిస్తామని అన్నారు. శంభీపూర్‌ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు రఘుపతిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'డంపింగ్' దుర్వాసన రాకుండా చూడాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య



డంపింగ్‌యార్డు వద్ద రాంకీ సంస్థలతో సమావేశమైన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డును బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సందర్శించి రాంకీ సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు పరిసరాల చుట్టూ దుర్వాసన రాకుండా చూడాలని, రసాయనాలను కాలనీలోకి వదలొద్దన్నారు. చుట్టూ ఉన్న ప్రాంతాలవారికి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం డంపింగ్‌యార్డు సీనియర్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు పరిసరాల చుట్టూ నూతన టెక్నాలజీతో వాసన రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్రమం తప్పకుండా స్ప్రే చేస్తున్నామని, రసాయన నీటిని లిచెట్ ట్రీట్‌మెంట్‌తో మంచినీటిగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సుచరిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

రజక ఫెడరేషన్ పునరుద్ధరించాలి

మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వం రజక ఫెడరేషన్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర రజక జేఏసీ చైర్మన్ పంజుగారి ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. కొన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ప్రకటించి రజకులను విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. రజక ఫెడరేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలపై పోరాటం చేస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రతీ ప్రభుత్వంలో రజకులకు అన్యాయం జరుగుతోందని, కొన్ని ప్రభుత్వాలు పనిముట్లు అందజేసి చేతులు దులుపుకున్నాయని, ఫెడరేషన్ మాత్రం మంజూరు చేయడంలేదని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రజక ఫెడరేషన్ ప్రకటించాలని, లేనిపక్షంలో రజకుల సత్తా చాటుతామని పేర్కొన్నారు.

కాలువ పైకప్పు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



కూలిన నారాయణ చానెల్ కాలువ పైకప్పును పరిశీలిస్తున్న బస్వరాజ్‌గౌడ్, రైతులు

ఘట్‌కేసర్: కాచవానిసింగారం ముత్వెల్లిగూడలో కూలిన నారాయణ చానల్ కాలువపై కప్పును నిర్మించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలువ ఒక వైపు నుంచి మరోవైపు వ్యవసాయ పనులు, పశువుల గడ్డికి వెళ్లే రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాలుతున్నారని పేర్కొన్నారు. కప్పు కూలి రెండేళ్లు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు కూలిన నారాయణ చానెల్ కాలువ కప్పును పరిశీలించారు. వినతిపత్రం అందజేసినవారిలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్‌ముదిరాజ్, రైతులు దినేశ్, శంకర్‌ముదిరాజ్, రియాజ్, శివరాజ్‌గౌడ్ యాదయ్య, రాజయ్య, నర్సింహ్మా, కృష్ణవేణి ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నోడల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవటంతోపాటు ముందస్తు కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని నోడల్ అధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల నోడల్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల నోడల్ ఆఫీసర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఎలాంటి లోపాలు తలెత్తకుండా విధులను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది డేటా నమోదు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలకు కావాల్సిన సామాగ్రి సేకరణ కూడా పూర్తి చేయాలని సూచించారు. పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంతోపాటు ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేయాలన్నారు. వాహనాలకు జీపీఎస్ సిస్టం అమర్చి, వాటిని ట్రాక్ చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ఎన్నికల ఖర్చు నియంత్రణపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్టీ, వీవీటీల ఏర్పాటు చేసి, శిక్షణ ఇవ్వాలన్నారు. క్లిష్టమైన పోలింగ్ బూతుల జాబితాను తయారు చేసి పోలీస్ బందోబస్తు పటిష్టపరచాలన్నారు. ఫారం 12 –డిని ముందుగానే అవసరమైన ఓటర్లకు అందజేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా పెయిడ్ న్యూస్, ప్రకటనల ఖర్చును వ్యయనియంత్రణ కమిటీకి ఎప్పటికప్పుడు పంపాలన్నారు. ప్రెస్ మీట్ల నిర్వహణకు సమాచార లోపం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, నోడల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వంటమనిషిపై హాస్టల్ యజమాని దాడి

పోచారం: వంట మనిషిపై హాస్టల్ యజమాని దాడి చేసిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన ప్రకారం ... యంనంపేట్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో మహబూబ్‌నగర్ జిల్లా సోమ్లా తండాకు చెందిన భుక్యా నరేష్, అతని భార్య సునీత పనిచేస్తున్నారు. రోజులాగే బుధవారం ఉదయం 120 మందికి టిఫిన్ సిద్ధం చేశారు. 120 మందికి సరిపోయినంత టిఫిన్ తయారు చేయలేదని నరేష్‌ను హాస్టల్ యజమాని వరుణ్‌రెడ్డి బూతులు తిడుతూ దాడి చేయడంతో కాళ్లు, వీపు, పక్కటెముకలపై గాయాలయ్యాయి. దీంతో సునీత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

పోచారం: వివాహిత అదృశ్యమైన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోడిమెట్లలోని ఓ ప్రైవేట్ బాలికల హాస్టల్‌లో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న కుప్ప వీరనాగ సుబ్రహ్మణ్యం, స్నేహలత దంపతులు పనిచేస్తున్నారు. ఫిబ్రవరి 26న వీరనాగు కాకినాడలో బంధువుల వివాహానికి వెళ్లి మార్చి 2న తిరిగి వచ్చాడు. స్నేహలత కనిపించకపోవడంతో హాస్టల్ యజమాని విక్రమ్‌ను విచారించగా, ఫిబ్రవరి 27న ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఎన్ని చోట్ల వెతికినా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో వీరనాగు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

24 సీసీ కెమెరాలు ప్రారంభం



విష్ణుపూరికాలనీలో సీసీకెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు విష్ణుపురి కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులందరూ ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. వివిధ కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకువచ్చే కాలనీలకు తనవంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి, మోకు రేణుకజగన్మోహన్‌రెడ్డి, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, దివ్వద యాకర్‌రావు, బదనపురం శ్రీనివాస్, సెక్టార్ ఎస్.ఐ. నాగరాజు, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్‌ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కాలనీవాసులు పైళ్ల మల్లారెడ్డి, కొత్త గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఘట్‌కేసర్: అంకుషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995–1996 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక శ్రీనిధి రిసార్ట్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా, ఉద్యోగం కారణంగా ఇంతకాలం దూరమైన బాల్యస్నేహితులను ఒక్కసారిగా చూసి పులకరించిపోయారు. స్నేహితులు, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో వారు చేసినచిలిపి పనులను జ్ఞాపకం చేసుకుని మురిసిపోయారు. తమ జీవితాలకు బంగారు బాట వేసిన ఉపాధ్యాయులు సుశీల, భాగ్యవతి, సాయిరెడ్డి, వెంకట్ స్వామి, భాస్కర్, సత్యనారాయణలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యార్థులు తులసి, అనిత, సునీత, స్వప్న, కవిత, గీత, సరస్వతి, మంగ, మహేశ్వరి, లాలయ్య, బాలస్వామి, అరవింద్, జాషువా, స్వామి సాబేర్, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.

అధికారులపై 'ప్రత్యేక' భారం!

- స్పెషల్ ఆఫీసర్లకు భారంగా సొంత శాఖ పనులతోపాటు జీపీల పర్యవేక్షణ
- పన్నుల వసూళ్లు, పారిశుధ్యం, పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణ సవాలే..



పన్నుల వసూళ్ల తంటా..

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు పల్లె పాలనలో ప్రత్యేక బాధ్యతలను చేపట్టిన జిల్లా స్థాయి అధికారులకు పరీక్ష కాలంగా మారనుంది. ఇంటి పన్నులతోసహా వివిధ రకాల పన్నుల వసూళ్లు.. వేసవిలో మంచినీటి నీటి సరఫరా, నీటి ఎద్దడి, పచ్చదనం(హరితహారం), పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, పంచాయతీల పర్యవేక్షణ వంటి ప్రత్యేక బాధ్యతలతోపాటు సొంత శాఖ పనులను చక్కబెట్టాల్సిన భారం మోయాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో గెజిటెడ్ అధికారులను గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ కొన్ని గ్రామాల్లో సక్రమంగా జరగడం లేదు. కొన్ని గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు, పారిశుధ్య పనుల పర్యవేక్షణ ప్రత్యేకాధికారులకు సవాల్‌గా మారుతోంది.

ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు రావటంతో పంచాయతీల్లో ఇంటి పన్నులతోసహా వివిధ రకాల పన్నులు, బకాయిల వసూళ్ల విషయంలో ప్రత్యేకాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి వస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పన్నుల రూపంలో రూ.26.60 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, సర్పంచుల పాలనలో వసూలు చేసింది రూ.15.48 కోట్లు మాత్రమే. మిగిలిన దాదాపు రూ.9 కోట్ల పన్ను వసూళ్ల బాధ్యత ప్రత్యేకాధికారులపై పడింది. ఈ 40 రోజుల్లో కూడా రూ.4 కోట్లే వసూలైనట్లు తెలుస్తోంది. ఒకవైపు రాజకీయ ఒత్తిడులు, మరోవైపు టార్గెట్ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో మార్చి నెలాఖరుకల్లా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించటం కష్టతరంగా మారుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా అత్యధిక శాతం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది, కానీ, అక్కడక్కడా పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను కూడా ప్రజలు ఎదుర్కొంటున్నారు.

పల్లెపాలనతో సంబంధం లేని శాఖలు

పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా పంచాయతీరాజ్ శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులను నియమించింది. పంచాయతీల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతోపాటు బహుళ అంతస్తుల భవనాలు కూడా వందల సంఖ్యలో వెలుస్తున్నాయి. వీటికి సంబంధించి అనుమతులు, ఇతరత్రా విషయాలు కూడా ప్రత్యేకాధికారులకు సవాలవుతున్నాయి. దీనికితోడు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింత పెరిగాయి. ప్రజలకు మెరుగైన పాలన అందించాలంటే క్రమం తప్పకుండా గ్రామపంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వర్తించడం ఎలా అనే ప్రశ్న వారిలో ఉత్పన్నమవుతోంది. ఒక్కొక్క అధికారికి రెండు, మూడు మండలాల పరిధిలో రెండు, మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో సుదూర ప్రయాణం చేయాల్సి కూడా రావటంతో కొసరు పని కోసం అసలు పనులు ఆగిపోయే ప్రమాదం లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేకాధికారులు రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇలా అనేకవిధాలుగా పనుల భారాలు మోయడం ప్రత్యేక అధికారులకు సవాలే.

ప్రభుత్వ ఆస్పత్రికి సీఎస్సార్ నిధులతో వైద్యపరికరాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న ఎంపీ లక్ష్మణ్

ఘట్‌కేసర్: రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోవ లక్ష్మణ్ గెల్ సంస్థ సీఎస్సార్ నిధులతో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 75 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలు, గురుకుల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓఆర్ఆర్ ప్లాంటును విరాళమిప్పించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి ఆపరేషన్ పరికరాలు, మంచాలు, ఆర్ఓఆర్ ప్లాంట్‌ను గెల్ సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనుగుప్తతో కలిసి ప్రారంభించారు. ఘట్‌కేసర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపీకి మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య వినతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, కౌన్సిలర్లు శశికళ, ఆంజనేయులుగౌడ్, జహంగీర్, రవీందర్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కోట్యనాయక్, బీజేపీ నాయకులు బిక్కు నాయక్, రామోజీ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్‌కు చెందిన ముఖేశ్ ఎంకిర్యాల్‌కు చెందిన దీపికతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ముఖేశ్ ఇబ్రహీంపట్నంలో వెల్డింగ్ పని చేస్తూ వారానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో యాదాద్రి –భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన రక్తని స్వామి(37)తో దీపికకు పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో స్వామి మంగళవారం రాత్రి తన భార్యతో గొడవపడి అవుషాపూర్‌లోని దీపిక ఇంటికి వచ్చాడు. అనంతరం రాత్రి పొద్దుపోయిన తర్వాత దీపిక నిద్ర నుంచి మేల్కొని చూసేసరికి వంట గదిలో స్వామి అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా వారు సంఘటన స్థలానికొచ్చి వివరాలు సేకరించి శవాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీపికతో తన భర్తకు అక్రమ సంబంధం ఉందని, మృతిపై అనుమానం ఉందని మృతుడి భార్య భవిత అలియాస్ కళ్యాణి ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.